క్లుప్తంగా

నైపుణ్యాలను పెంపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ హెచ్‌ఎం రమ

సి.బెళగల్: విద్యార్థులలో విద్యా నైపుణ్యాలను పెంపొందించి, వారి అభివృద్ధికి కృషి చేయాలని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమ ఉపాధ్యాయులకు అన్నారు. పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంప్లెక్స్ సమావేశంలో చర్చించే అంశాలు విద్యార్థుల పురోగతి దోహదపడేలా ఉండాలని సూచించారు.

అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు

సి.బెళగల్: ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఉదయం పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో ఎస్‌ఐ గస్తీ నిర్వహించారు. సి.బెళగల్ కొండ నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎర్రమట్టిని అక్రమంగా తరలించే వారిపై ప్రజలు సమాచారం ఇవ్వాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: హౌసింగ్ కాలనీలలో వివిధ దశల్లోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయించాలని ఎంపీడీఓ రాణెమ్మ సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ సుమంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్‌తో కలిసి గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. హౌసింగ్ కాలనీ లేవుట్లలో, సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలు మూడు నెలలోగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రజలు మరుగుదొడ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

పంటలకు బీమా ప్రీమియం చెల్లించండి


పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

గడివేముల:రబీలో పంటలు సాగుచేసిన రైతులు డిసెంబర్ 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని ఏఓ హేమ సుందర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గడిగరేవుల, తిరుపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాలతో పంటలు దెబ్బతింటే పరిహారం అందించేందుకు బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

డంపింగ్ యార్డు పరిశీలన

పాణ్యం: ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ వద్ద డంపింగ్ యార్డును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మదేశేఖర్ పరిశీలించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు డంపింగ్ యార్డును పరిశీంచామని ఏఈ చెప్పారు. పాణ్యంలో సేకరించిన చెత్తను కాల్వ పక్కన, పైపులైన్‌పై వేసి కాల్చుతున్నందున పైపులన్ దెబ్బతిరడమే కాక, కాల్వలో చెత్త పడుతుందన్నారు. ఈ మేరకు విషయాన్ని పంచాయితీ ఈఓ ఆనందరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. డంపింగ్ యార్డును మార్చాలని పంచాయితీ సిబ్బందికి సూచించామని ఏఈ తెలిపారు.

చిత్ర పటాల గురించి అవగాహన

కల్లూరు: ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు ప్రణాళికలో భాగంగా సామాజిక చిత్రటాల గురించి ఏపీఓ మద్దేశ్వరమ్మ బుధవారం కె.మార్కపురం, పర్ల గ్రామ పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సామాజిక చిత్ర పటం, గ్రామాల్లోని వనరుల మ్యాప్, సీజనల్ మ్యాప్‌లను ముగ్గు వేసి వివరించారు. అలాగే సల్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ (ఎస్‌డబ్ల్యూపీసీ)కు మార్కింగ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వరి రైతులను ముంచిన సుడిదోమ!

- పైరు చివరి దశలో విజృంభించిన తెగులు
- ఎక్కడికక్కడ ఎడిపోతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


కృష్ణదొడ్డిలో సుడిదోమ తెగులుకు గురైన వరిపంట


సుడిదోమ తెగులు లక్షణాలను రైతులకు వివరిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: అన్నదాతలను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఏదోవిధంగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సుడిదోమ తెగులు వరి రైతులను ముంచేస్తుంది. సి.బెలగల్ మండలంలోని నదీతీర గ్రామాలతో పాటు నీటి సౌల భ్యం పొలాల రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. అన్నింటికీ ఓర్చుకుంటూ పంటలను కాపాడుకున్నారు. వరి కోతల దశకు వచ్చా యి. నదీతీర ప్రాంతాల్లో కోతలు ప్రారంభం అయ్యాయి కూడా. బోర్ల కింద సాగైన వరి పది, పదిహేను రోజుల్లో కోతలు చేపడుతారు. ఇంతలోనే సుడిదోమ అన్నదాతను వెంటాడింది. దీంతో వరిపైరు ఎండిపోతుంది. చేతికొచ్చిన పంట ఎండిపోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికిప్పుడు కోతలు చేపట్టినా దిగుబడిపై ప్రభా వం తీవ్రంగా ఉంటుందంటున్నారు. సి.బెళగల్ మండలంలో 21 గ్రామాలు ఉండగా, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కాలువల ద్వారా 194.55 ఎకరాలు, పైపులైను, బోర్ల ద్వారా 45.6 ఎకరాలు, చెరువుల కింద 298 ఎకరాలు, ఎత్తిపోతల పథకాల ద్వారా 1,151.3 ఎకరాలతో చొప్పున మొత్తంగా 1,554.45 ఎకరాలలో వరిని రైతులు సాగు చేశారు. సాధారణ వరి సాగు విస్తీర్ణం 2,010 ఎకరాలుగా ఉంది. ముడుమాలలో గ్రామంలో అత్యధికంగా 488 ఎకరాలలో వరిపంట సాగైంది. అదేవిధగా బ్రాహ్మణ దొడ్డిలో 330 ఎకరాలు, కొండాపురంలో 210 ఎకరాలలో రైతులు వరిపంటను అధికంగా సాగు చేశారు. అయితే సుడిదోమ తెగులతో నష్టాలు తప్పడం లేదని వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరి దశలో విజృంభణ

వరి పంట చివరి దశలో సుడిదోమ తెగులు వ్యాధి కారక పురుగులు పంటలపై విజృంభిస్తుంటాయి. ముఖ్యంగా పంట పీకల దశలో వరి గంటకకు (దుబ్బులకు) 10 నుంచి 20 పురుగులు ఉంటే, ఈనిక దశలో దుబ్బులకు 20 నుంచి 25 వరకు తీవ్ర స్థాయిలో వ్యాధి కారక పురుగులు వ్యాప్తి చెందుతాయి. ఈ సమయంలో తెగులు నుంచి పంట సంరక్షణ కష్టసాధ్యంగా మారుతుంది. దాదాపు 155 ఎకరాలలో సుడిదోమ తెగులు వ్యాధితో పంటలు నష్ట పోయినట్లు ఆయా గ్రామాల రైతులు ఆవేదనను వ్యక్త పరుస్తున్నారు. ప్రత్యేకించి కృష్ణదొడ్డి, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల తదితర గ్రామాల్లో వరి పంటలను సుడిదోమ తెగులు సోకింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

సుడిదోమ తెగులు లక్షణాలు

సుడిదోమ తెగులుతో పంట ఎండుదశకు చేరుతుంది. గోధుమ వర్ణపు లేదా, తెలుపు వీపు మచ్చ దోమలు దుబ్బుల అడుగున నీటి మట్టంపై కనిపిస్తుంటాయి. ఈ దోమలు దుబ్బుల నుంచి రసాన్ని పీలుస్తాయి. పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది. ఈ లక్షణాలతో వరికాడలు పూర్తిగా నిస్సారంగా ఉండి కంకులలో ఉన్న గింజలు తాలుపోతాయి. సుడిదోమ వ్యాధితో పంటలు నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముందస్తు చర్యలతోనే తెగులు వ్యాప్తి నివారణ

మందుస్తు చర్యలు పాటిస్తే తెగులు వ్యాప్తిని నివారించొచ్చని చెబుతున్నారు అధికారులు. ముఖ్యంగా సుడిదోమ తెగులు తట్టుకునే రకాల విత్తనాలను రైతులు ఎంచుకుని విత్తుకోవాలి. పంట నాటుకునే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్ల చొప్పున కాలిబాటలుగా వదుకోవాలి. సుడిదోమ సోకిందని గుర్తించిన వెంటనే నివారణకు బూప్రొఫెజిన్ 1.6 మిల్లీ లీటర్లు (ఎంఎల్), లేక ఇథోఫెన్ 2.0 ఎంఎల్, లేక ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేక ఇమిడా క్లోప్రిడ్‌కు ఎథిప్రోల్ 80 డబ్ల్యూజీ 0.25 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి. లే మోనోక్రోటోఫాస్ 2.2 ఎంఎల్ లే, పైమెట్రోజిన్ 0.6 గ్రాములు లేదా డైనోటిఫ్యూరాన్ 20ఎస్‌జీ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలుపుకుని వరి పంటలలో పిచికారీ చేసుకుంటే ఈ తెగులు వ్యాప్తిని కట్టడి చేయొచ్చు.

పంట మొత్తం ఎండిపోతోంది



వరి చేను ఇక ఇరవై రోజులు ఉంటే కోత ఉంది అన్న సమయంలో తెగులు వచ్చింది. మొదట కొంత మాత్రమే బిల్లగా ఉండేది. ఇప్పుడు మొత్తం వ్యాపిస్తుంది. చేను మొత్తం తెలగు వచ్చేలా ఉంది. ఇప్పటికే సాగనికి పైగా ఎండిపోయ్యింది. గింజలు భలంగా ఉండటం లేదు. పంట మొత్తం ఎండిపోతాదేమోనని భయంగా ఉంది. ప్రభుత్వం సహాయం చేస్తే బాగుంటుంది.

– వెంకటేష్, రైతు, సి.బెళగల్

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి సాగుకు అనుకూలం లేదు. అయినప్పటికీ రైతులు ఆశతో నీటి వసుతులున్న పొలాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంటలు కొతకు వచ్చాయి. అయితే సుడిదోమ తెగులుతో పంటలు ఎండిపోతున్నాయి. కొంతమంది రైతులకు పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లింది. పెట్టుబడి కూడ వచ్చేలా లేదు. వరిపంటలో నష్టపోన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మోహన్, సీపీఎం నాయకుడు

రబీలోనైనా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు పంట సాంద్రతకు అధిక ప్రధాన్యత ఇవ్వాల్సి ఉంది. పంట మధ్యలో కాలి బాటలు ఉంచుకోవడం లేదు. దీంతోనే సుడిదోమ తెగులు వరిపైరును నాశనం చేస్తుంది. ఇప్పటికై నా రైతులు జాగ్రత్తలు పాటించాలి. కనీసం రబీ సీజన్‌లోనైన రైతులు పంట సాగు మధ్యలో కాలిబాటలు వదులుకుంటే బాగుంటుంది.


– మల్లేష్‌కుమార్, ఏఓ, సి. బెళగల్ మండలం

పెట్రోల్ బంక్‌ల తనిఖీ


పెట్రోల్ నిల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని పెట్రోల్ బంక్‌లను బుధవారం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తనిఖీ చేశారు. పెట్రోల్ నిల్వలు(డెన్సిటీ) టెంపరేచర్, ధరలు, వినియోగదారులకు కల్పించిన వసతులను పరిశీలించారు. లైసెన్స్‌లు నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అనే విషయాలను తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్, మండల ఇంజినీరు నాగేంద్ర, వీఆర్‌ఓ బీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం


నూతనంగా నిర్మించిన దుర్గమ్మ ఆలయం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ, వేటసోమప్ప ఆలయం ప్రారంభోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అదేవిధంగా ధ్వజస్తంభ ప్రతిష్ట చేస్తామన్నారు. ఉదయం 8 నుంచి 9:32 గంటల మధ్యలో విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్టలు, దేవతా మూర్తులకు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని పెద్దలు కోరారు.

అధిక సాంద్రత పత్తి సాగు లాభదాయకం


సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

కల్లూరు: అధిక సాంద్రత పత్తి సాగు రైతులకు లాభదాయకమని కర్నూలు డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. బుధవారం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రైతు క్షేత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. భారత రైతు సమాఖ్య సంఘాల మాజీ ప్రధాన కార్యదర్శి బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సులభతరంగా రైతులకు ఆదాయన్నిచ్చే అధిక సాంద్రత పద్ధతులను రైతులకు చేరువ చేయాలన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కేవీకే బనవాసి కేంద్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఈ విధమైన వ్యవసాయ పద్ధతిలో ఎకరాలో దాదాపు 29,000 మొక్కలను పెంచవచ్చన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పైరును అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అపార్డు సంస్థ అధినేత తిరుపతిరెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ సర్వేశ్వరరెడ్డి, డీపీఎమ్ కుమార స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. రైతులకు తక్షణమే రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తున్నారని, వారిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు నష్టపోయిన వారికి వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలులో రైతులు పండించిన ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోవడం అన్యాయమన్నారు. నాయకులు సురేంద్రయాదవ్, తిమ్మయ్య హాజరయ్యారు.

స్క్వాడ్ బృందం తనిఖీలు

కర్నూలు (సిటీ): ఈనెల 17వ తేదీ నుంచి జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య పరీక్ష కేంద్రాలను బుధవారం స్క్వాడ్ బృందం రాయలసీమ జిల్లాల్లోని కేంద్రాలన్నింటిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. కర్నూలు నగరంలోని కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగానే పరీక్షలు జరుగుతున్నట్లు బృందం నిర్ధారించింది. ఆయా కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేసింది. అయితే స్క్వాడ్ నిర్వహించే తనిఖీలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయా కళాశాలల యాజమాన్యాలు వర్సిటీ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేశారు.

రజకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. బుధవారం కేకే భవన్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ముక్కన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. ఇస్త్రీ షాపులు, దోబీఘాట్ల నిర్వహణకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలని, రజక వృత్తిదారులకు అండగా రక్షణ చట్టం తేవాలని, రజక కార్పొరేషన్ ద్వారా రూ.2000 కోట్ల రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే అపార్టుమెంట్లు, ఇస్త్రీదారులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గురుశేఖర్, సీహెచ్ శ్రీనివాసులు, జయమ్మ, శేషాద్రి పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పరమేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈఓ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. బేస్‌బాల్ సంఘం కార్యదర్శి సుబ్బయ్య, అధ్యక్షుడు రమణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కల్యాణి, మాధవి, బుచ్చిబాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గడివేముల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐడీ డీఎస్పీ వాహిద్ బాషా సూచించారు. మండల కేంద్రం గడివేముల మోడల్ స్కూల్‌లో పోక్సో, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్టీలు అడవుల్లో లోతట్టు ప్రాంతాల్లో సమాజానికి దూరంగా, ఎస్సీలు కూడా ప్రత్యేక వాడలు జీవనం సాగిస్తుంటారని, వారి అభివృద్ధికి అమలు చేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగ సవరణల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. సమాజంలో వివక్షకు గురికాకుండా వాటిని ఉపయోగించుకుని, తమ ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. కులమత బేధాలకు పోకుండా అందరూ సమానంగా జీవించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారిని చింతామణి, సీఐడీ సీఐలు శ్రీధర్, గిరిబాబు, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేగుప్త, పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, వెంకట్ రెడ్డి, రహంతుల్లా, ప్రిన్సిపాల్ శైలజ, మహిళా పోలీసులు అమలేశ్వరీ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలి


సాగు మెలకువలను రైతులకు వివరిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రబీ కింద సాగు చేసిన వేరుశనగ, శనగ పంటలను రైతులు ప్రతి రోజు పరిశీలిస్తూ తెగుళ్లు సోకకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తిలో బుధవారం ఏఓ రైతులతో కలిసి వేరుశనగ, శనగ పంటపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట పూత దశకు రాగానే ఎకరాకు 200కిలోల జిప్సంను చల్లాలన్నారు. లధ్యపురుగు నివారణకు ఎకరాకు 10కిలోల తౌడుకు 2కిలోల బెల్లం పాకంగా చేసి 500ఎంఎల్ క్లోరోఫైర్పాస్ లేదా కార్బరిల్ 500గ్రాములు కలిపి సాయంత్రం సమయంలో పొలంలో చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలస్వామి,ఎంపీటీసీ సందప్ప, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి బస్సు నడపాలి


అసిస్టెంట్ మేనేజర్ దీప్తికి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కోడుమూరు రూరల్ : గూడూరు మండలంలోని జూలకల్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి విద్యార్థి బస్సును సమయానికి అనుగుణంగా నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా కోరారు. ఈ మేరకు వారు బుధవారం కర్నూలు–2 డిపో అసిస్టెంట్ మేనేజర్ దీప్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలకల్లు మోడల్ స్కూల్లో గూడూరుతో పాటు, పెంచికలపాడు, బూడిదపాడు, గుడిపాడు గ్రామాలకు చెందిన విద్యార్థులు సుమారు 200మందికి పైగా చదువుతున్నారన్నారు. అయితే పాఠశాల సమయానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌టీసీ అధికారులు స్పందించి పాఠశాల సమయానికి బస్సును నడపాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ గూడూరు మండల నాయకులు ఖాజా, సాయి, ఉదయ్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కోడుమూరు రూరల్ : గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ మేరకు గూడూరు బాలుర హైస్కూల్ విద్యార్థులకు గ్రంథాలయాధికారి మధునాయుడు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు గూడూరు తహసీల్దార్ రామాంజినేయులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలురు, బాలికల హైస్కూళ్ల హెచ్‌ఎంలు సురేష్‌బాబు, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడుమూరులో....

గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కోడుమూరులోని బాలుర హైస్కూల్ విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈఓ తైమూర్‌బాషా చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ – వెలుగు ఏపీఎం రామేశ్వర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో లైబ్రేరియన్ వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఏపీఎం మాట్లాడారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను, పుస్తక పఠనం ప్రయోజనాలను వివరించారు. ఆటల పోటీల ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కల్లూరు: కల్లూరు అర్బన్ కృష్ణనగర్‌లోని కేశవరెడ్డి స్కూల్‌లో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, క్రీడల పోటీలలో ప్రతిభ చాటిని విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి సంధ్యారాణి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఓర్వకల్లు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆయా శాఖ గ్రంథాలయ అధికారులు కౌసల్య, హనుమే నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

గడివేముల: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మహీధర్‌రెడ్డి సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ముగింపు సందర్భంగా బుధవారం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరెడ్డి, రాజరాజేశ్వరీ కరస్పాండెంట్ రామేశ్వరరావు, చెన్నయ్య, రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థునికి బహుమతులు అందజేస్తున్న అధికారులు


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సంధ్యారాణి


విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం


బహుమతులు తీసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు


విద్యార్థికి బహుమతిని అందిస్తున్న దృశ్యం

ఉపాధి పనులు కల్పించండి

కల్లూరు: ఉపాధి కూలీలకు అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఎంపీడీఓ నాగేశాచల రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధి సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన టార్గెట్‌ను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ ఎర్రమల, ఏపీఓ మద్దేశ్వరమ్మ సిబ్బంది పాల్గొన్నారు.